# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-02-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **2026--27 ఆర్థిక సంవత్సరానికి 3 లక్షల 32వేల 205 కోట్ల రూపాయలతో వార్షిక బడ్జెట్‌ను ఈరోజు శాసనసభలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టారు.**

2. **సైనికుల త్యాగానికి దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.**

3. **జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలు మహిళా క్రీడాకారిణుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, క్రీడా అభివృద్ధికి దోహదపడతాయని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.**

4. **ఐసీసీ టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో రేపు భారత్, పాకిస్తాన్ జట్లు తలపడనున్నాయి.**

==========================

రాష్ట్ర ప్రభుత్వం 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఈరోజు చట్టసభలకు సమర్పించింది. ఈ ఉదయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో 2026--27 ఆర్థిక బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. అనంతరం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శాసన సభలో బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశపెట్టారు. అదే సమయంలో శాసన మండలిలో హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత బడ్జెట్‌ను సమర్పించారు. ఆ తరువాత వ్యవసాయ బడ్జెట్‌ను ప్రత్యేకంగా వ్యవసాయ శాఖ మంత్రి కే. అచ్చె న్నాయుడు ప్రవేశపెట్టారు.

--------------------------

రాష్ట్ర ప్రభుత్వం 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఈరోజు శాసనసభలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి 3 లక్షల 32వేల 2 వందల అయిదు కోట్ల రూపాయలతో బడ్జెట్ ను మంత్రి ప్రవేశ పెట్టారు. రెవెన్యూ వ్యయం 2 లక్షల 56 వేల 143 కోట్ల రూపాయలు, మూలధన వ్యయం 53 వేల 9 వందల 15 కోట్లు రూపాయలుగా నిర్ణయించారు. కాగా రెవెన్యూ లోటు 22,002 కోట్లు, ద్రవ్య లోటు 75 వేల 8 వందల 68 కోట్ల రూపాయలుగా పేర్కొన్నారు. విద్యుత్తు రంగానికి 13 వేల 9 వందల 34వేల కోట్లు రూపాయలు, రహదారులు, పోర్టులు, విమానాశ్రయాలకు కలిపి 13 వేల 5 వందల 46 కోట్ల రూపాయలు, పరిశ్రమల కోసం 3 వేల 161 కోట్ల రూపాయలను కేటాయించారు.

వాయిస్ .. 30 సెకన్లు

----------------------

2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో కీలక ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం కేటాయింపులు ప్రకటించింది. రాజధాని అమరావతి నిర్మాణానికి 6 వేల కోట్ల రూపాయలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి 6 వేల 105 కోట్ల రూపాయలు కేటాయించారు. రాష్ట్రానికి సంబంధించి వీబీజీ రామ్‌జీ పథకానికి 8 వేల 365 కోట్లు, గృహ నిర్మాణానికి 5 వేల 451 కోట్ల రూపాయలు, ఎన్టీఆర్ వైద్య సేవకు 4 వేల కోట్ల రూపాయలు కేటాయించారు. 9 జిల్లాల పరిధిలోని అమరావతి ఆర్థిక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు పది జిల్లాల పరిధితో విశాఖపట్నం ఆర్థిక ప్రాంత అభివృద్ధికి 28 వేల కోట్ల రూపాయలు, అలాగే రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు 30 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్‌లో వెల్లడిస్తూ..

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధి చేయాలనే సంకల్పంతో బడ్జెట్‌ను రూపొందించినట్లు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు రంగాలకు సంబంధించి బడ్జెట్ వివరాలను వెల్లడించారు. అన్నదాత సుఖీభవకు 6 వేల 6 వందల కోట్ల రూపాయలు, మత్స్య కారులకు 2 వందల 60 కోట్ల రూపాయలను కేటాయించారు. స్వచ్ఛ భారత్ కింద 1037 కోట్ల రూపాయలు విడుదల చేయగా గతంలో ఆగిపోయిన జల జీవన్ పథకానికి 4 వేల కోట్ల ప్రకటించినట్లు మంత్రి పయ్యావులు కేశవ్ తెలియజేస్తూ...

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

సైనికుల త్యాగానికి దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. పుల్వామా ఉగ్రదాడికి నేటితో ఏడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన సామాజిక మధ్యమం ఎక్స్ వేదికగా నివాళు లర్పించారు. సైనికుల సంకల్పం, దేశ సేవ ఎప్పటికీ నిలిచి ఉంటాయని చెప్పారు. ఈ ఉగ్ర దాడిలో 40 మంది CRPF జవాన్లు మృతి చెందినట్లు ప్రధానమంత్రి గుర్తు చేశారు.

---------------------------

జాతీయ స్థాయి పోటీలు నెట్‌బాల్ మహిళా క్రీడాకారిణుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, క్రీడా అభివృద్ధికి దోహదపడతాయని క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. విజయవాడలో కృష్ణా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆలిండియా ఇంటర్ వర్సిటీ ఉమెన్ నెట్ బాల్ పోటీలను మంత్రి స్థానిక శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావుతో కలిసి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళల నెట్‌బాల్ క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా 88 విశ్వవిద్యాలయాల జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి.

---------------------------

ఐసీసీ టీ20 ప్రపంచకప్ లో భారత్, పాకిస్తాన్ జట్లు రేపు తలపడనున్నాయి. శ్రీలంకలోని కొలంబోలో

ఉన్న ఆర్.ప్రేమదాస స్టేడియం వేదికగా రాత్రి ఏడు గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది.ఇప్పటికే ఇరు జట్లు చరో రెండు మ్యాచ్ లు గెలుపొందాయి.

---------------------------

ప్రకాశం జిల్లా సింగరాయకొండ సమీపంలోని పాకల తీర ప్రాంతంలో ఈరోజు, రేపు నిర్వహించే బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లు పూర్తి అయ్యాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. పాకలలో జరుగుతున్న ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆయన నిన్న రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వినోద, సాంస్కృతిక, సాహస క్రీడలతో కూడిన బీచ్ ఫెస్టివల్ ప్రజలకు మంచి అనుభూతిని పంచుతాయని పేర్కొన్నారు. తీర ప్రాంతంలో భద్రతకు సంబంధించి పోలీసు యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. బీచ్ ఫెస్టివల్ కు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి వెల్లడించారు.

---------------------------

చిన్నారులలో పుట్టుకతో వచ్చే గుండె జబ్బుల పట్ల గుండె లోపాల అవగాహన దినోత్సవాన్ని ఈరోజు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. శిశువులు జన్మించినపుడు గుండె జబ్బులు తేలికపాటి నుంచి తీవ్రస్థాయి వరకు ఉండే అవకాశం ఉంది. శిశువులు జన్మించిన వెంటనే వీటిని గుర్తించి తగిన చికిత్స అందిస్తే సమస్యను శాశ్వతంగా నివారించవచ్చు. పీడియాట్రిక్ కంజెనిటల్ హార్ట్ అసోసియేషన్, అమెరికన్ హార్ట్ అసోసియేషన్ వంటి సంస్థలు గుండె లోపాల అవగాహన దినోత్సవాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 20వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

రాష్ట్రంలో నాలుగేళ్ల బియస్సీ నర్సింగ్ కోర్సుల్లో నీట్-యుజీ పరీక్ష ఆధారంగా ప్రవేశాలను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ ప్రతిపాదనకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెలినట్లు ఆ శాఖ వెల్లడించింది. 2026-27 విద్యా సంవత్సరంలో నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలను ఆశించే విద్యార్థులు నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్ట్ యుజీ పరీక్ష రాయాల్సి ఉంటుందని ఒక ప్రకటనలో పేర్కొంది.

=====================